## క్లుప్తంగా

### బకాయి వేతనాలు చెల్లించాలి



కామారెడ్డి టౌన్: బాన్సువాడ, ఎల్లారెడ్డి ఏరియా ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు కార్మికులతో కలిసి శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు దశరత్ మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. బాలరాజు, రేణుక, గంగారం, కాశిరావు, సురేఖ, సాయిబాబా, కల్యాణి, సంగీత, శారద, పోషవ్వ, మహేందర్, సాయిలు, గంగారం పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాచారెడ్డి: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫరేషన్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ సూచించారు. పాల్వంచ మండలం ఫరీదుపేటలో శనివారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో ఖాతాదారులకు ఆయన అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లకు వచ్చే అనవసర లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. అనంతరం ఆర్బీఐ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి నవీన్, గ్రామస్తులు ఉన్నారు.

### సీనియర్ సిటిజన్లకు క్రీడాపోటీలు



కామారెడ్డి అర్బన్: పట్టణంలో శనివారం వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ప్రతి రోజు సాయంత్రం వివిధ అంశాల్లో పోటీలుంటాయని ఆయన అన్నారు. విజేతలకు ఈనెల 26న (గణతంత్ర దినోత్సవం) బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న, క్రీడల ఇన్చార్జిలు నరసింహం, మోహన్‌రెడ్డి, విశ్వనాథం, పురుషోత్తం, అశోక్‌రావు, అంజయ్య, చంద్రకాంత్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

### మహిళా సంఘాల్లో సభ్యులను చేర్పించాలి



రాజంపేట: మహిళా సంఘాల్లో చేరని గృహిణులను గుర్తించి, వారిని సంఘంలో చేర్పించాలని ఐకేపీ ఏపీఎం సాయిలు అన్నారు. మండలంలోని పెద్దాయిపల్లి గ్రామంలో శనివారం నూతన సభ్యుల చేరిక కార్యక్రమాన్ని చేపట్టి, పలు సంఘాల్లో సభ్యులను చేర్పించినట్లు తెలిపారు. సీసీలు శ్రీనివాస్, రమేష్, వీఓఏలు అన్నపూర్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

### అర్హులకు రేషన్‌కార్డులు అందించాలి



రామారెడ్డి: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందేలా కృషిచేయాలని డీఎస్‌వో మల్లికార్జునబాబుకు జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్‌లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి శనివారం కోరారు. కాంగ్రెస్ నాయకులు రగోతం రెడ్డి, పోతుల చిన్న భాస్కర్ రెడ్డి, మద్దికుంట దయానంద్, తదితరులు ఉన్నారు.

### ఎంఈవోకు సన్మానం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లోని పీజీ హెచ్‌ఎం రాంమనోహర్ రావు ఇటీవల ఎంఈవోగా నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయనను శనివారం ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.

### రైల్వే ట్రాక్ కాంట్రాక్టర్లకు..

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో శనివారం రైల్వే ట్రాక్ పనుల కాంట్రాక్టర్లు సుదర్శన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డిలను వీడీసీ ఆధ్వర్యంలో సన్మానించారు. గ్రామంలోని దుర్గమ్మ గుడికి బోర్ వేయించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారిని సన్మానించారు. వీడీసీ ప్రతినిధులు సూర్యకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శశికుమార్, చిన్న భూంరెడ్డి పాల్గొన్నారు.

# ఇరుకు వంతెనలతో ఇక్కట్లు

- లింగంపేట మండలంలో పలుచోట్ల శిథిలావస్థకు చేరిన వైనం
- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



ఇరుకుగా ఉన్న లింగంపేట పెద్దవాగు వంతెన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న పాత వంతెనలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయి. లింగంపల్లి(ఖుర్దు) వద్దగల పాముల వాగు వంతెన రోడ్డు కుంగిపోయి బీటలు వారింది. దాంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. లింగంపేట సమీపంలోని పెద్ద వాగు వంతెన ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వంతెన నిర్మించి దశాబ్దాలు గడుస్తుండడంతో శిథిలావస్థకు చేరుకుంది. గత కొద్ది సంవత్సరాల క్రితం వంతెనకు ఇరువైపులా సపోర్టు కోసం ప్రహరీలు నిర్మించారు. నాగారం వద్ద పది సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన గత రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు



లింగంపల్లి(ఖుర్దు) పాముల వాగు వంతెన

కోతకు గురైంది. వర్షాకాలంలో రెండేళ్లుగా రాకపోకలు నిలిచిపోయి పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు శాశ్వతంగా మరమ్మత్తులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వంతెనలు ప్రమాదకరంగా మారాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే వంతెనల మనుగడ ప్రశ్నార్థకంగా మారి ముప్పు పొంచి ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే వంతెనల వద్ద డీసీఎంలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలతో పాటు పలు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వంతెనల వద్ద అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనలు ఇరుకుగా ఉండడంతో తరుచూ వంతెన ప్రహరీలను వాహనాలు ఢీకొని ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాల్కంపేట, భవానిపేట, లింగంపల్లి(ఖుర్దు), లింగంపేట, మోతె, మెంగారం, ముంబోజీపేట గ్రామాలకు వెళ్లే రోడ్లలో నిర్మించిన వంతెనలకు ఇరువైపులా ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళ తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పాత వంతెనల స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలని, ఇరుకు వంతెనలను విస్తరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రహరీ లేక ప్రమాదకరంగా పాల్కంపేట వంతెన

### కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో శనివారం కాంగ్రెస్ నేతలు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. అలాగే పలువురు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నరసింహారెడ్డి, రాంరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో శనివారం కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కిరణ్, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పథకాలను వివరించారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీసర్పంచ్ నర్సాగౌడ్, నాయకులు సాయిలు, రమేష్, కార్యకర్తతదితరులు పాల్గొన్నారు.



### బడిబయట పిల్లల గుర్తింపు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎక్కపల్లి, సురాయిపల్లి, కొట్టాల్‌గడ్డతండా తదితర గ్రామాల్లో శనివారం బడి బయట పిల్లల సర్వే నిర్వహించినట్లు ఎంఈవో శౌకత్అలీ తెలిపారు. ఈసందర్భంగా బడికి వెళ్లకుండా నెలల తరబడి ఇంటి వద్ద ఉన్న ముగ్గురు పిల్లలను గుర్తించామన్నారు. సీఆర్పీలు రాజు, విజయ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలో..



ఎల్లారెడ్డి: మండలంలో శనివారం ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించినట్లు సీఆర్పీలు తెలిపారు. మండలంలోని వెల్లుట్లతండా, కొట్టాల గ్రామాల్లో నిర్వహించిన బడిబయట పిల్లల సర్వేలో ఇద్దరు పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. సీఆర్పీలు ముజుబుద్దీన్, మహిపాల్, విజయలక్ష్మి ఉన్నారు.

## ఆధ్యాత్మికం..

### శ్రీవారి ఆలయంలో పోచారం పూజలు



బాన్సువాడ: సింగపూర్ నగరంలోని శ్రీ భూదేవి సమేత శ్రీనివాస పెరుమాళ్ ఆలయంలోని వేంకటేశ్వర స్వామిని శనివారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. సింగపూర్ నగరానికి వెళ్లిన పోచారం దంపతులు, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దంపతులు శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండేలా చూడాలని స్వామిని వేడుకున్నారు.

### గోపాల్ మహరాజ్ భిక్షాటన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ గ్రామంలో జుక్కల్ సమర్థ రామదాసు పీఠాధిపతి గోపాల్ మహరాజ్ శనివారం భిక్షాటన దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సాహాలకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించడానికి ప్రతి ఇంటికి తిరిగి భిక్ష అడిగి ప్రసాదంగా ఇస్తామని ఆయన తెలిపారు.

### హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలివచ్చి ఆలయంలోని స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహరాజ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

### శివాలయంలో..



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శివాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించి అర్చకులు, అభిషేకాలు చేశారు. శివభిక్ష కమిటీ ఆధ్వర్యంలో నిత్యం భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

### ఓంశాంతి కేంద్రంలో విశ్వశాంతి దివస్



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఓంశాంతి కేంద్రంలో శనివారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు ప్రజాపిత బ్రహ్మ 56వ పుణ్య స్మృతి విశ్వశాంతి దివస్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన శాంతి స్తంభానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయ దీదీ, బ్రహ్మకుమారీలు గంగలత, కవిత, లలిత, చంద్రకళ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరాలయంలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో పల్లకీసేవ నిర్వహించారు.

# రెండు రోజుల్లో సర్వేలను పూర్తిచేయాలి



గుర్జకుంటలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి..



పుల్కల్ గ్రామంలో..



తుజ్బల్ గ్రామంలో..

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న రేషన్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేలు

సాక్షి నెట్‌వర్క్: వచ్చే రెండు రోజుల్లో వందశాతం రేషన్ కార్డు సర్వే, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా సర్వేలను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాల కోసం అర్హులను ఎంపిక చేసేందుకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో జిల్లా యంత్రాంగం సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శనివారం పలు గ్రామాల్లో నిర్వహించిన సర్వేలను స్థానిక అధికారులు, సిబ్బంది పరిశీలించారు. భిక్కనూరు మండలం గుర్జకుంటలో జరుగుతున్న సర్వేలను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి పలు సూచనలను అందించారు. సర్వేలను పకడ్బందీగా చేయాలన్నారు. సర్వేలను ఈనెల 20వరకు పూర్తి చేసి 21నుంచి నిర్వహించే గ్రామసభల్లో సర్వే వివరాలను వెల్లడించాలన్నారు. అలాగే పలు మండలాల్లో సర్వేలను మండల అధికారులు తనిఖీ చేసి, సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు.



కోనాపూర్ గ్రామంలో..



రాజంపేటలో..



గాంధారిలో..



తాడ్కోల్ గ్రామంలో..



సుల్తాన్‌పేట్‌లో..



కన్నాపూర్ గ్రామంలో..

## సంక్షిప్తం

### ఎన్టీఆర్‌కు ఘన నివాళి



కామారెడ్డి టౌన్/తాడ్వాయి: జిల్లాకేంద్రంలో శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, దివంగత నేత ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామంలోనూ పార్టీ నాయకులు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### తలసేమియా బాధితుడికి రక్తదానం

కామారెడ్డి అర్బన్: జుక్కల్‌కు చెందిన ఓ పదేళ్ల బాలుడు తలసేమియా వ్యాధికి గురయ్యాడు. ఈ వ్యాధితో బాధపడే వారికి ప్రతి 20 రోజులకు ఒకసారి రక్తం అవసరం అవుతుంది. ఈక్రమంలో ఓ పాజిటివ్ రక్తం బాధితుడికి అవసరం కాగా పటోళ్ల జనార్దన్‌రెడ్డి అందజేసినట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు శనివారం తెలిపారు. ఇంకా దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

### ఆలయంలో గ్రానైట్ పనులు ప్రారంభం



బీబీపేట: మండలంలోని ఉప్పర్‌పల్లిలోగల మాల పోచమ్మ ఆలయంలో శనివారం బీజేపీ నాయకులు గ్రానైట్ పనులు ప్రారంభం చేశారు. ఎమ్మెల్యే కేవీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పనులు చేస్తున్నట్లు వారు తెలిపారు. నాయకులు రంజిత్‌గౌడ్, నక్క రవీందర్, ప్రవీణ్, సంతోష్‌గౌడ్, పిడుగు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, బాల్‌నర్సు, తేజ, వేణు పాల్గొన్నారు.

### ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 2లక్షల 21వేల 649 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు శనివారం తెలిపారు. పర్మిట్ల ఆధారంగా క్రషింగ్ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### రాజంపేటలో వైద్య శిబిరం



రాజంపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం మానసిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. సైకియాట్రిస్ట్ రమణ పలువురికి వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే మందులు పంపిణీ చేశారు. సిబ్బంది రాహుల్, గంగమణి, ఇందిరా, సంతోష్ తదితరులు ఉన్నారు.

### పిల్లలకు టీకాలు వేయించాలి



రాజంపేట: చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని రాజంపేట పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మంజూర్ అన్నారు. పొందుర్తిలోని సబ్‌సెంటర్‌లో శనివారం ఆయన పిల్లలకు టీకాలు వేశారు. సిబ్బంది సంగీత, గంగామణి, యాదమ్మ పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పాల్కంపేట గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు. నాయకులు ఎల్లమయ్య, నాగరాజు, అశోక్, భాస్కర్‌గౌడ్, నగేష్, అజయ్‌గౌడ్, శ్రీనివాస్, శివకుమార్, సంజీవరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రయ్య, సాయిబాబా, నారాయణ, సంతు, అజయ్, మోహన్‌గౌడ్, దుర్గాపతి. తదితరులు పాల్గొన్నారు.

జానకంపల్లి కుర్దు గ్రామంలో..

ఎల్లారెడ్డి: మండలంలోని జానకంపల్లి కుర్దు గ్రామంలో సీసీ రోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. నాయకులు వెంకటరామిరెడ్డి, సంతోష్ నాయక్, సామెల్, సాయిలు, షెకావత్‌అలీ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధుల విడుదలపై హర్షం

బాన్సువాడ: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడంపై బాన్సువాడ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కేంద్రం రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించిందని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కుమారస్వామికి బీజేపీ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### రైతులకు రుణాల అందజేత

రాజంపేట: రైతులకు నూతనంగా మంజూరైన రుణాలను శనివారం రాజంపేట సొసైటీ ఆధ్వర్యంలో అందజేసినట్లు సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్ తెలిపారు. 62మంది రైతులకు రూ.43లక్షలు అందజేసినట్లు తెలిపారు. వైస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు బాలయ్య, సుధాకర్‌రెడ్డి, సాయిబాబా, సునీత, శ్రీరామ్, సురేశ్, బస్వయ్య, నర్సవ్వ, సీఈఓ వెంటేశ్వరశర్మ ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ తండాకు చెందిన మోహన్ గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్సపొందుతూ మృతిచెందాడు. శనివారం బాధిత కుటుంబానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ రూ. 5000 ఆర్థికసహాయం అందజేశారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జొన్నల రాజు, దశరథ్‌నాయక్, పూల్‌సింగ్, నగేష్, రాజు, ప్రసాద్‌గౌడ్, రామకృష్ణగౌడ్, సలీం, శివలాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### కౌమారదశలో జాగ్రత్తలు పాటించాలి



రామారెడ్డి: కౌమార దశలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని వర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో శనివారం వారు రామారెడ్డి, సదాశివనగర్ మండలాల్లోని పలు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సదాశివనగర్ కుప్రియల్ రామారెడ్డి మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట్, పాఠశాలలో శనివారం కౌమార దశపై అవగహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ సిబ్బంది రాణి, యాదగిరి, వంశీకృష్ణ, శ్రీవిద్య పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భూమయ్య, రాజలింగం, సంతోషి, మోనికా, రమేష్, నిజాం, మోహన్ పాల్గొన్నారు.

స.హ. చట్టం ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డి: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం సమాచార హక్కు చట్టం రాష్ట్ర శాఖ క్యాలెండర్‌ను డీఎస్పీ శ్రీనివాసులు ఆవిష్కరించారు. కమిటీ డైరెక్టర్ సలీం, మదర్ పాషా, లింగమయ్య, మోహన్‌రెడ్డి, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కామారెడ్డి & ఎల్లారెడ్డి

96034 62494
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899